
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
శుక్రవారం 15 ఆగస్టు 2025



## ఇంద్రేశం, జిన్నారం.. మున్సిపాలిటీలుగా గెజిట్

పటాన్‌చెరు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం, జిన్నారంను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ గురువారం సాయంత్రం ప్రభుత్వం గెజిట్ నోట్ విడుదల చేసింది. రుద్రారం, లక్డారం గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నట్లు స్పష్టత ఇచ్చారు. ఆయా పంచాయతీల రికార్డులు సోమవారం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలను పంచాయతీరాజ్ శాఖ నుంచి తొలగించకపోవడంతో మున్సిపాలిటీపై ఎటువంటి స్పష్టత రాలేదు.

### 161 జాతీయ రహదారిపైనా ఫాస్టాగ్ వార్షిక పాస్

- రూ.3 వేలతో 200 ట్రిప్పులకు చెల్లుబాటు
- 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌తో సేవలు
- నేటి నుంచి అందుబాటులోకి..

7



### కార్మికుల ప్రాణాలతో చెలగాటం

- పరిశ్రమల నిర్లక్ష్యంపై ఆందోళన
- ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకోని అధికారులు

7



# అక్రమాలకు అండ.. పంచాయతీల పచ్చజెండా

- అక్రమ నిర్మాణాలకు సహకారం
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు
- కట్టిన ఇళ్లకు అసెస్‌మెంట్ నంబర్లు
- డబ్బులిస్తే అన్నీ సక్రమమే..
- కొందరు కార్యదర్శుల మాయాజాలం

*గ్రామ పంచాయతీల్లో అక్రమ నిర్మాణాలకు కొందరు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల కోసం నిబంధనలను పక్కనపెట్టి తప్పుడు సర్టిఫికెట్లు ఇస్తున్నారని, అధికారుల సమగ్ర విచారణతోనే ఈ అక్రమాలు బయటపడే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.*

మెదక్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనేక గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శులే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు అడిగినంత డబ్బులు ఇస్తే, ప్రభుత్వ స్థలాలతో పాటు అక్రమ లేఅవుట్‌ల లోని ప్లాట్లకు అసెస్‌మెంట్ నంబర్లు (ఇంటి పన్ను నంబర్లు) ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నంబర్ల ఆధారంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోతున్నాయి.

### కార్యదర్శుల మాయాజాలం

ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ముందుగా పంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ చాలా సందర్భాల్లో అనుమతులు లేకుండానే నిర్మాణాలు పూర్తవుతున్నాయి. కొంత డబ్బు ముట్టజెబితే ఆ నిర్మాణాలకు అసెస్‌మెంట్ నంబర్లు ఇచ్చి, ఇంటి పన్ను విధించే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. పక్కా మౌలిక సదుపాయాలు లేకపోయినా, అధికారుల అండతో పనులు చక్కబెట్టుకుంటున్నారు. అంతేకాకుండా, రికార్డుల్లోని లాజర్ బుక్‌లలో (అసెస్‌మెంట్ రిజిస్టర్) డేటాను మార్చి, అక్రమ నిర్మాణాలకు కొత్తగా ఇంటి నంబర్లను కేటాయిస్తున్నారు. ఈ అక్రమాలకు పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఇంజనీర్లు బాధ్యులైనా.. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని చర్యల నుంచి తప్పించుకుంటున్నారు.

### మధ్యవర్తులుగా డాక్యుమెంట్ రైటర్లు

అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలనుకునే వారు డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయిస్తున్నారు. వీరు స్థలం కొనుగోలుదారులకు, అసెస్‌మెంట్ నంబర్లను జారీ చేసేవారికి మధ్యవర్తులుగా

మిగతా 8వ పేజీలో



### అనుమతులు లేకుండానే అంతస్థులు!

*నిబంధనలు పాటించకపోవడంతో ప్రజల భద్రతకు ముప్పు*

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారుల పక్కన, సన్నని వీధుల్లో ఇలాంటి ఎత్తైన భవనాలను నిర్మించడంతో ట్రాఫిక్కు, అగ్నిమాపక సౌకర్యాలకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శివారులోని ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై అనేకసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ఇంజనీరింగ్ ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న ఈ భవనాల వల్ల అగ్ని ప్రమాదాలు, భారీ వర్షాలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఎప్పటికైనా ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అనుమతులు లేని భవనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జీజీహెచ్‌లో బిక్కుబిక్కు..

- శిథిలావస్థకు చేరిన సంగారెడ్డి జనరల్ ఆస్పత్రి
- పాత భవనం.. పెచ్చులూడుతున్న పైకప్పు
- ఆందోళనలో వైద్యులు, సిబ్బంది, రోగులు
- కొత్త భవనంలో కనిపించని పురోగతి

*'గత నెల 26న జీజీహెచ్ ఆస్పత్రి ఐసీయూలో ఫాల్ సీలింగ్ పైకప్పు పాక్షికంగా కూలింది. ఆ సమయంలో రోగులు, సందర్శకులు ఇంకెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులోనూ అకస్మాత్తుగా స్లాబ్ పైకప్పు పెచ్చులూడటంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది పక్కన పడటంతో పెద్ద ప్రమాదమే తప్పింది.'*

దాదాపు అన్ని వార్డుల్లో ఏదో చోట స్లాబ్ పైకప్పు పెచ్చులు పడుతున్నాయి. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ఇక్కడ వైద్య సిబ్బంది ఉన్నారు.

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుని మనుగడ ప్రమాదకరంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రి పైకప్పు పెచ్చులూడుతున్నది. అక్కడక్కడా వర్షపు నీటి లీకేజీలు ఉన్నాయి. గోడలకు తేమ వచ్చి తడిసి ముద్దవుతున్నాయి. ఎప్పుడేం జరుగుతుందోనని డాక్టర్లు, వైద్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, ఆయా వార్డుల్లో ఉండే ఇన్‌పేషెంట్లు ఈ పరిస్థితి చూసి బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో పెచ్చులూడిన పైకప్పు

### కొత్త భవన నిర్మాణంపై కదలికేదీ?

జీజీహెచ్ పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా 500 పడకల సామర్థ్యంతో రూ.273.40 కోట్ల నిధులతో కొత్త టీచింగ్ హాస్పిటల్ భవనం నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఈ భవన నిర్మాణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ నుంచి టీజీఎంఎస్ ఐడీసీకి అప్పగిస్తూ జూన్ 27న ప్రభుత్వం జీవో వెలువరించింది. కానీ, ఇప్పటివరకు కొత్త భవనం నిర్మాణానికి సంబంధించి అడుగు ముందుకు పడలేదు. ఇందుకు సంబంధించిన పనుల్లో పురోగతి లేదు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇలాకాలోని పెద్దాస్పత్రి దుస్థితి ఇలా ఉండడం విమర్శలకు తావిస్తున్నది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ప్రమాదం సంభవించకముందే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రోగులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న ఐఓసీ భవనం

# 'ఐవోసీ' పనులకు మోక్షం

కలెక్టర్ చొరవతో ప్రత్యేక నిధులు

తూప్రాన్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు ఇక సొంత భవనాలు

తూప్రాన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో రెండేళ్లుగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐఓసీ) భవన నిర్మాణ పనులు ఇటీవల కలెక్టర్ చొరవతో తిరిగి ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో తూప్రాన్ డివిజన్ కేంద్రంలో రూ. 10 కోట్లతో ఐవోసీ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అందులో రూ. 2 కోట్లు పట్టణాభివృద్ధికి మళ్లించారు. మిగిలిన రూ. 8 కోట్లతో 2022 మార్చిలో పనులు మొదలుపెట్టారు. అయితే, అదనంగా రూ. 3 కోట్లు అవసరం కావడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

### కలెక్టర్ చొరవతో నిధులు

తూప్రాన్‌కు కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైన నేపథ్యంలో, కోర్టుకు అనువైన భవనం లేకపోవడంతో ఐఓసీ భవనంపై దృష్టి పడింది. వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌లో తాత్కాలికంగా కోర్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా, కలెక్టర్ రాహుల్ రాజ్ మాత్రం ఐఓసీ భవనాన్ని పూర్తిచేయాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేక నిధుల నుంచి రూ. 11.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం కేవలం మూడు కార్యాలయాలను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించడంతో, మిగిలిన అన్ని కార్యాలయాలకు నిధులు కేటాయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కోర్టు ఏర్పాటుకు మార్గం సుగమం

మండల ప్రజా పరిషత్ కార్యాలయం త్వరలో ఐవోసీలోకి మారిన అనంతరం, ఆ పాత ఎంపీపీ భవనంలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రతిపాదిస్తున్నారు. నెల రోజుల్లో ఇది పూర్తి కావచ్చని అధికారులు తెలిపారు.

# వనదుర్గ సన్నిధిలో మంజీర పరవళ్లు

*అమ్మవారికి రాజగోపురంలో నిత్య పూజలు*



వనదుర్గ ఆలయం వద్ద మంజీర నది ప్రవాహం

పాపన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సింగూరు నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. మంజీరా నది పరవళ్లు తొక్కడంతో ఆనకట్ట అలుగు పారుతున్నది. వనదుర్గామాత ఆలయాన్ని మంజీర ప్రవాహం చుట్టుముట్టింది. ఆలయం ఎదురుగా ఉన్న వంతెన వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ముందుజాగ్రత్తగా గురువారం ఉదయాన్నే ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ప్రతిష్ఠించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం భక్తులు గమనించాలని ఆలయ సిబ్బంది కోరారు. వరద ఉధృతి తగ్గగానే ఆలయాన్ని తెరుస్తామని వెల్లడించారు.

వనదుర్గా ప్రాజెక్టును మెదక్ ఆర్డీవో రమాదేవి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సతీష్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల వైపు ప్రజలు వెళ్లవద్దని సూచించారు.

● వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు ఆయా గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



దూప్‌సింగ్ తండాలో బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

### ప్రజల రక్షణకు సిద్ధంగా ఉన్నాం

*మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్*

హవేళిఘణపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు, సహాయ చర్యల్లో పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పోచారండ్యాం, దూప్‌సింగ్ తండా బ్రిడ్జిలను గురువారం వారు పరిశీలించారు. దూప్‌సింగ్ తండాలో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు వాగులు, ప్రవాహాలు దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

### ఆందోళనల మధ్య డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

జహీరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదాలకు పంపిణీ చేసేందుకు గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. 640 ఇళ్లకు గాను ప్రస్తుతం 530 మందికి తాళాలు అప్పగించారు. అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉండటంతో మిగిలిన లబ్ధిదారులకు విచారణ అనంతరం ఇస్తామని ప్రకటించారు. దీంతో, పలువురు లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో తోపులాట జరిగింది. దీంతో, కొందరిని పోలీసులు బలవంతంగా బయటకు పంపించారు. ఓవైపు నాయకులు మాట్లాడుతుండగానే మరోవైపు ఆందోళన కొనసాగింది. గతంలో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందజేశామని, తాళాల అప్పగింతలో జాప్యం జరిగిందని, ఎంపిక చేసినవారందరికీ తాళాలు అప్పగించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇళ్లు రాలేదని నిరుత్సాహపడొద్దని, విచారణ అనంతరం అందరికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, నిర్మాణాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు ఉజ్వల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు తాళాలు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



చేగుంట ఆగ్రో సేవ కేంద్రం వద్ద రైతుల లైన్



వెల్దుర్తి సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్ద బారులు

### యూరియా కోసం రైతుల బారులు

వర్షాలు పుష్కలంగా కురుస్తుండటంతో యూరియా కోసం రైతులు దుకాణాలకు పోటెత్తుతున్నారు. వెల్దుర్తి పీఏసీఎస్ కార్యాలయం, చేగుంటలోని రైతు ఆగ్రో సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంతో తెలియడంతో రైతులు గురువారం ఉదయం నుంచే బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ సిబ్బంది రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలను పరిశీలించి యూరియా బస్తాలను అందజేశారు.

-వెల్దుర్తి/చేగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

# పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

పంద్రాగస్టు వేడుకలకు అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను అందంగా ముస్తాబు చేశారు. సంగారెడ్డి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. మెదక్‌లో జరిగే వేడుకలకు ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై జెండా ఎగుర వేయనున్నారు. అనంతరం పరేడ్, వివిధ శాఖల శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

-సంగారెడ్డి క్రైం, మెదక్ అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డిలో...



# లాభాలు చూపించి రూ.39.5 లక్షలు టోకరా

పటాన్‌చెరు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడు రూ.39.5లక్షలు మోసపోయాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి ఆన్‌లైన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 16న ఫోన్‌లో వచ్చిన లింక్‌ను తెరిచి యాప్‌ను తెరిచాడు. దానిలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుడు పెడితే అధిక లాభాలు వస్తాయని ఉంది. దీంతో ఖాతా తెరిచి, అందులో రూ.50వేలు వేశాడు. అదే రోజు రూ.4వేలు లాభం చూపించారు. 4వేలు నుంచి 16వందల రూపాయలు ఖాతా నుంచి డ్రా చేశాడు. అంతా సక్రమంగానే ఉందనుకున్నాడు. అనంతరం రూ.2.25లక్షలు ఆన్‌లైన్ ఖాతాలో వేశాడు. వీటికి రూ.4లక్షలు లాభం చూపించారు. అనంతరం రూ.24లక్షలు కట్టి సభ్యత్వం తీసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఇందుకు తగ్గట్టుగా 24లక్షలు ఆన్‌లైన్ ఖాతాలో వేశాడు. దీనికి రూ.1.34కోట్లు లాభం చూపించారు. దీనిలోంచి రూ.45లక్షలు డ్రాచేయబోతుండగా 15శాతం ఆదాయపు పన్నుకింద రూ.6.75లక్షలు కట్టాలని కోరారు. ఇందుకు తగ్గట్టుగా మొత్తం ఆన్‌లైన్‌ఖాతాలో జమచేశాడు. మరో రూ.3లక్షలు కట్టాలంటూ కోరడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**ఐటీ ఉద్యోగినికి రూ.19.99లక్షలకు టోపీ**

ఇంటి వద్దే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చు అని వచ్చిన ప్రకటన చూసి ఐటీ ఉద్యోగిని మోసపోయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చుగూడ గ్రామానికి చెందిన ఓ ఐటి ఉద్యోగిని ఫోన్‌కు పార్ట్‌టైం జాబ్ పేరుతో ఎస్ఎంఎస్ లింక్ వచ్చింది. పెట్టుబడి పెడితే లాభాలు అర్జించవచ్చంటూ నమ్మబలికారు. దీంతో గత నెల 16న లింక్ తెరిచి రూ.52,365లు ఆన్‌లైన్ ఖాతాలో వేసింది. రూ.40వేలు, 50వేలు దఫాలుగా వేశారు. రూ.1,83,799లు వేశారు. దీనికి రూ.రెండు లక్షలు లాభం చూపించడంతో రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని డబ్బులు వేయాలంటూ వారు చెప్పడంతో రూ.19,99లక్షలు వేసింది. వాటిని డ్రా చేయబోగా రావడంలేదు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది..

# 24 గంటల్లో దోపిడీ కేసు ఛేదన

● నిందితుడి అరెస్ట్

మెదక్ అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని దోపిడీ ఘటనను పోలీసులు.. 24 గంటల్లోనే ఛేదించారు. పాత నేరస్థుడిని అరెస్టు చేసి.. అతడి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. హవేళీఘనపూర్ మండల పరిధిలోని మదుల్వాయి గ్రామానికి చెందిన గజ్జల బిక్షపతి ఈ నెల 13న బస్సులో ప్రయాణిస్తూ ఓ మహిళతో పరిచయం చేసుకున్నాడు. అదేరోజు సాయంత్రం 5 గంటల సమయంలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి, మహిళను నమ్మించి మద్యం తాగించి, మత్తులోకి జారుకున్న తర్వాత ఆమెపై దాడి చేసి బంగారు చెవి కమ్మలు దోచుకెళ్లాడు.

బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. మద్యం దుకాణంలోని సీసీ ఫుటేజ్ ఆధారాలను, నిందితుడు ధరించి దుస్తుల ఆనవాళ్ళ గుర్తించిన పోలీసులు కీలకమైన సమాచారాన్ని సేకరించారు.

గురువారం నిందితుడిని గుమ్మడిదలలో అరెస్టు చేసి.. దొంగలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. దోపిడీ కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగంను ఎస్పీ, అదనపు ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

**పాత నేరస్థుడే**

బిక్షపతి గతంలో పలు నేరాల్లో అరెస్టు అయ్యాడు. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి, మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొని, రెండో భార్యతో గుమ్మడిదలలో నివసిస్తున్నాడు. మద్యం, జూదం, వంటి వ్యసనాలకు బానిసై విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడి ఖర్చుల కోసం నేరాలకు పాల్పడ్డాడు.

2015లో మెదక్ పట్టణంలో దొంగతనం కేసులో మొదటి సారి అరెస్టయ్యాడు. నిందితుడిపై మెదక్ టౌన్‌లో 5 కేసులు, గుమ్మడిదల టౌన్‌లో 2, అల్వాల్, హత్నూర, నారాయణఖేడ్‌లో 1 చొప్పున కేసులు నమోదయ్యాయి. మెదక్ టౌన్‌లో ఫోక్స్ కేసు కూడా నమోదైనట్లు ఎస్పీ తెలిపారు.





## బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రధానోపాధ్యాయుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రధానోపాధ్యాయుడు గురువారం మృతి చెందాడు. గజ్వేల్ మండలం జాలిగామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కి కొన్ని రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ గురువారం మృతి చెందాడు. శ్రీనివాస్ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గజ్వేల్‌లో ఉంటున్నాడు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి ..

పాపన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బోరుబావి వద్ద స్టార్టర్ రిపేర్ చేస్తుండగా, విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని కందిపల్లిలో జరిగింది. బాధిత వర్గాల కథనం ప్రకారం.. కందిపల్లి గ్రామానికి చెందిన టేక్మాల్ విఠల్ (42)కూలీ పనులతో పాటు, బోర్ల మరమ్మతులు చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతు బోరు మోటరు పనిచేయకపోవడంతో, అతడి కోరిక మేరకు రిపేర్ కోసం వెళ్లాడు. కాగా స్టార్టర్ బాక్సు విద్యుత్ ప్రసారం కావడంతో, దాన్ని ముట్టగానే, కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే రైతులు, అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే విఠల్ మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు ఉన్నారు. పాపన్నపేట ఎస్సైని వివరణ కోరగా, విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

## హత్యా! ఆత్మహత్యా?

● అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కుకునూరుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లకుడారం గ్రామ శివారులోని కల్పన వెంచర్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మృతి హత్యనా ఆత్మహత్యనా అనేది అనుమానాస్పదంగా ఉంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉండవచ్చని, లకుడారం శివారులో నిర్మించిన వెంచర్‌లో చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకున్నాడని వెంచర్ సూపర్‌వైజర్ ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఒక వస్త్రంతో చిన్న చెట్టుకి ఉరివేసుకొని ఉన్నాడని, అతని వద్ద ఏ వివరాలు లభించలేదని అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఐదు అడుగుల చెట్టుకి ఉరి వేసుకొని ఆత్మహత్యకి పాల్పడతారా అనే అనుమానం కలుగుతుంది. ఎవరో ఆ వ్యక్తిని చంపి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లుగా తెలుస్తోంది. మర్మాంగాలపై బలంగా కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

## మహిళ మృతదేహం లభ్యం

కంగ్టి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజారాం తండా శివారులో గురువారం సాయంత్రం మహిళ మృతదేహం లభ్యమైంది. నారాయణఖేడ్ - కంగ్టి ప్రధాన రహదారికి పక్కనే రాజారా తండా చౌరస్తాకు కిలో మీటర్ దూరంలో వ్యవసాయ క్షేత్రంలోని ఓ షెడ్డులో మహిళ మృతదేహం ఉన్నట్లు మేకల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కంగ్టి సీఐ వెంకటరెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు తుర్కవడగాంకు చెందిన నర్సమ్మ(40)గా గుర్తించారు. మృతురాలి శరీరంపై వస్త్రాలు లేకుండా బండరాయితో మోదిన ఆనవాళ్లు కనిపించడంతో అనుమానాలు తలెత్తి క్లూస్ టీంకు సమాచారం అందించారు. మహిళ మృతిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గేదెను ఢీ కొన్న ద్విచక్రవాహనం

● ఇరువురికి తీవ్రగాయాలు

మద్దూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారు గేదెను ఢీ కొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దూరు నుంచి చేర్యాలకు వెళ్లే దారిలోని కల్వర్టు సమీపంలోని మూలమలుపులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీ కొన్న ఘటనలో చేర్యాల మండలంలో జరిగింది. ఈ క్రమంలో వేచరేణికి చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వివాహానికి హాజరైన నర్సింహులు, మరోవ్యక్తి తిరిగి వస్తుండగా కల్వర్టు సమీపంలోని మూలమలుపులో గేదె అడ్డుగా రావడంతో ప్రమాదవశాత్తు ఢీ కొట్టారు. దీంతో కిందపడ్డ ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా ప్రథమచికిత్స అనంతరం చేర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# 161 జాతీయ రహదారిపైనా ఫాస్టాగ్ వార్షిక పాస్

● రూ.3 వేలతో ఏడాదంతా 200 ట్రిప్పులకు చెల్లుబాటు
● 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌తో సులభమైన సేవలు
● నేటి నుంచి అందుబాటులోకి..



161 జాతీయ రహదారిపై తాడ్దానిపల్లి వద్ద టోల్‌ప్లాజా

పుల్‌కల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రయాణించే వారి కోసం ఫాస్టాగ్ వార్షిక పాస్ నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. రూ.3000 చెల్లించి ఏడాది మొత్తం 200 ట్రిప్పులు తిరిగేందుకు ఈ పాస్ చెల్లుబాటు అవుతుంది. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) దీనికోసం ప్రత్యేకంగా రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను ప్రవేశపెట్టింది. సంగారెడ్డి - నాందేడ్ ఎస్ఎన్ఏ 161 జాతీయ రహదారిపై కూడా ఈ యాప్ సేవలను పొందవచ్చు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, ఈ వార్షిక పాస్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు వర్తించదని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వాహనదారులను కోరుతున్నారు.

## సెంట్రల్ జైలులోకి మొబైల్ ఫోన్లు నిషేధం

● జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీ

కంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సెంట్రల్ జైలు లోపలికి మొబైల్ ఫోన్లను నిషేధిస్తూ జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. జైలును సందర్శించే రాజకీయ నాయకులు, వీఐపీలు, అలాగే జైలు సూపరింటెండెంట్, జైలర్లు, ఇతర సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లను లోపలికి తీసుకెళ్లరాదు. జైలు ప్రధాన గేటు వద్దే ఫోన్లను ఉంచాల్సి ఉంటుంది. భద్రత దృష్ట్యా, జైలు లోపల ఫొటోలు, వీడియోలు తీయడం కూడా నిషేధించారు. ఈ చర్యలు జైలు లోపలి విషయాలు బయటకు రాకుండా ఉండేందుకు తోడ్పడతాయని అధికారులు తెలిపారు.

## సంగారెడ్డి జైలులో న్యాయ సేవాధికార సంస్థ తనిఖీ

● ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా


జైలు వద్ద న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, కోర్టు, జైలు సిబ్బంది

కంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీ జరిగింది. ఖైదీలకు బెయిల్, ములాఖత్‌లు సకాలంలో అందుతున్నాయా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. జైలులోని బ్యారక్‌లు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, ఖైదీల భోజనాన్ని రుచి చూశారు. ఖైదీలకు ఉచిత న్యాయవాదులను నియమిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని జైలు సూపరింటెండెంట్ కళాసాగర్‌కు ఆమె సూచించారు.

## అట్టహాసంగా అండర్-18 బాస్కెట్‌బాల్ పోటీలు

● ప్రతిభ కనబర్చిన 73 మంది క్రీడాకారుల ఎంపిక


బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో టీబీఏ, వోక్సెన్ యూనివర్సిటీ ప్రతినిధులు

మునిపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులోని వోక్సెన్ యూనివర్సిటీలో అండర్- 18 బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ట్రయల్స్‌లో ప్రతిభ చూపిన 49 మంది బాలురు, 24 మంది బాలికలు ఎంపికయ్యారు. ఈ శిబిరంలో ఎంపికైన క్రీడాకారులు 75వ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వోక్సెన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రౌట్ వి.రోడ్రిగేజ్, హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ విశాల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభావంతులను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## ఆల్ కబీర్ పరిశ్రమ మూసివేయాలని డిమాండ్

ఈడీ అభియోగపత్రాన్ని పరిగణలోకి తీసుకున్న పీఎంఎల్ఏ కోర్టు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని ఆల్ కబీర్ పరిశ్రమపై ఈడీ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని హైదరాబాద్‌లోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు పరిగణలోకి తీసుకోవడంతో, ఈ పరిశ్రమను మూసివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పశుమాంసం వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయట పారవేయడంతో పరిసరాల్లోని నీరు, వాతావరణం కలుషితమయ్యాయని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. వ్యర్థాల శుద్ధి చేయకపోవడం ద్వారా కంపెనీ రూ.61 లక్షలు అక్రమంగా కూడబెట్టుకుందని దర్యాప్తులో తేలింది. ఈ పరిశ్రమ వల్ల వాయు కాలుష్యం తీవ్రంగా పెరిగిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమను మూసివేయాలని గతంలో బీజేపీతో పాటు, స్థానికులు పలు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. 2017లో పీసీబీ చర్యలకు ఉపక్రమించగా, ఈడీ కంపెనీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేసింది. తాజాగా కోర్టు అభియోగపత్రాన్ని పరిగణలోకి తీసుకోవడంతో, పరిశ్రమను శాశ్వతంగా మూసివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

వైద్యుల సకాల స్పందనతో తల్లీబిడ్డలు క్షేమం


సన్‌రైజ్ ఆస్పత్రిలో ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు ఆడ శిశువులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన మాచెపల్లి సభ బేగం, సమీయుద్దీన్ దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు ఆడ శిశువులు జన్మించారు. బుధవారం రాత్రి హఠాత్తుగా పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను సంగారెడ్డిలోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మల్లిక, కృష్ణలు తక్షణమే స్పందించి సీజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ముగ్గురు శిశువులు జన్మించారని వైద్యులు తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క శిశువు 1.68 కిలోల బరువుతో జన్మించారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ తల్లీబిడ్డలను సురక్షితంగా కాపాడిన వైద్యులకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఆసుపత్రి ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుందని సన్‌రైజ్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ పి.స్వామిగౌడ్ తెలిపారు.

## పప్పులతో మువ్వన్నెల జెండా



79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు తన దేశభక్తిని వినూత్నంగా చాటుకున్నారు. మూడు రకాల పప్పు ధాన్యాలను ఉపయోగించి 10 అడుగుల పొడవుతో మువ్వన్నెల జెండాను తీర్చిదిద్దారు.

- గజ్వేల్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

## తిరంగా ర్యాలీ




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దుబ్బాకలో భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు ప్రధాన వీధుల్లో జాతీయ జెండాతో ప్రదర్శనగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- దుబ్బాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

# మొక్కజొన్నకు కత్తెర కాటు

పురుగు నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



కొండపాక మండలం బందారంలో మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు

కొండపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటకు 'కత్తెర' పురుగు ఆవహించింది. వాతావరణ మార్పులు, కాలానుగుణ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఈ పురుగు పంట పెరుగుదలను నిలిపివేయడంతో పాటు, దిగుబడిని కూడా తగ్గిస్తుంది. దీన్ని సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

### కత్తెర పురుగు లక్షణాలు

● ఆకులు కోసినట్లుగా కనిపిస్తాయి. ఆకుల మీద గుళికల రూపంలో గుడ్లు ఉంటాయి.
● పిల్ల పురుగులు సమూహంగా కదలి, ఆకులను పూర్తిగా తినేస్తాయి.
● పంట పెరుగుదల ఆగిపోతుంది.

### నివారణ చర్యలు

● ఈ పురుగు గడ్డి మొక్కల ద్వారా వ్యాపిస్తుంది. దీని నివారణకు అంతర కృషి ద్వారా పొలం గట్లపై ఉన్న గడ్డిని, మునుపటి పంటల అవశేషాలను పూర్తిగా తొలగించాలి.
● లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. జీవ క్రిమినాశకాలను కూడా వాడవచ్చు. పురుగు తీవ్రతను బట్టి రసాయనిక మందులను పిచికారీ చేయాలి.
● క్వినాల్‌ఫాస్ 25 ఈసీని లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి
● క్లోరిపైరిఫాస్ 20 ఈసీ లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్లు కలిపి, 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
● ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను తొలి దశలో పంటకు పిచికారీ చేయాలి.
● స్పైనోసాడ్‌ను లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

## దేవుడా.. నా అప్పులు తీర్చు

● హుండీలో భక్తుడి వింత కోరికలు



భక్తుడి కోరికలతో రాసిన నోట్

కౌడిపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆలయ హుండీలో సాధారణంగా భక్తులు డబ్బులు, బంగారం, వెండి వంటివి వేస్తుంటారు. కానీ మెదక్ జిల్లా కౌడిపల్లిలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో ఓ భక్తుడు తన కోరికలు రాసిన చిన్న నోట్‌బుక్‌ను సమర్పించాడు. గురువారం హుండీ లెక్కింపు సందర్భంగా ఈ వింత విషయం వెలుగులోకి వచ్చింది. ఆ నోట్‌బుక్‌లో ఆ భక్తుడు తనకు ఉన్న రూ.20 లక్షల అప్పులు, భూ సమస్య, చెల్లి పెళ్లి, మంచి ఉద్యోగం వంటి కోరికలను ఏకరువు పెట్టి, వాటిని 21 రోజుల్లో తీర్చాలని రాశాడు. నాలుగు నెలల 18 రోజుల తర్వాత నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో ఆలయానికి రూ.7,43,345 ఆదాయం లభించింది. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శనం చేసుకుని పూజలు చేశారు.

# రోడ్డు ప్రమాదంతో కదిలిన యంత్రాంగం

చిల్వర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు

ప్రమాదాల నివారణకు అధికారులు హామీ


చిల్వర్ వద్ద ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్, పోలీసులు

అల్లాదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని 161వ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై అధికారులు స్పందించారు. ఈనెల 13న చిల్వర్ బస్‌స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై ప్రజల ఆందోళనతో అధికార యంత్రాంగం కదిలింది. అండర్ బ్రిడ్జి నుంచి మందాపూర్ వెళ్లే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం జరిగిన ప్రమాదం తర్వాత స్థానికులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీంతో గురువారం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ శంకర్.. జాతీయ రహదారి అధికారులను చిల్వర్ గ్రామానికి పిలిపించారు. గ్రామస్థులు, అధికారులు ప్రమాదాల గురించి చర్చించి, చిల్వర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తాం: సంగారెడ్డి ఆర్టీసీ డీఎం

చిల్వర్ వద్ద జరిగిన ప్రమాదంపై సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చిల్వర్-మందాపూర్ గ్రామాల ప్రయాణికులకు ఇది ప్రధాన బస్టాండ్ అయినప్పటికీ, ఆర్టీసీ బస్సులు ఇక్కడ ఆగకుండా వేగంగా వెళ్లిపోతున్నాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన డీఎం ఉపేందర్.. చిల్వర్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటామని, ఇక్కడ రిక్వెస్ట్ బస్‌స్టాప్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## విద్యార్థుల ధర్నాకు స్పందించిన ఆర్టీసీ అధికారులు


చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆగిన బస్సు

చేగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ఎక్కించుకోవడం లేదంటూ విద్యార్థులు చేసిన ధర్నాకు అధికారులు స్పందించారు. సిద్దిపేట ఆర్టీసీ డీఎం రఘు ఆదేశాల మేరకు గురువారం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సు ఆపి విద్యార్థులను ఎక్కించుకున్నారు. కళాశాల సమయానికి అనుగుణంగా బస్సు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీశైలంకు ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం నారాయణఖేడ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఈ నెల 17న ఉదయం 8 గంటలకు మంగల్‌పేట బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను చార్జీ రూ. 1700 మాత్రమేనని, ఆసక్తి ఉన్నవారు 9959223170, 9441071134, 9676667703 నంబర్లను సంప్రదించాలని కోరారు. 30 మంది ప్రయాణికులు ఉంటే ఎక్కడి నుంచి అయినా బస్సును పంపుతామని డీఎం పేర్కొన్నారు.

## విద్యారంగాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వాలు

● సిద్దిపేట జిల్లా మహాసభను జయప్రదం చేయాలి
● యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న రవి

గజ్వేల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నీరుగారుస్తున్నాయని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి విమర్శించారు. గజ్వేల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంపై బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తున్నారని, ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తున్నారని అన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో గజ్వేల్‌లో జరిగే యూఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభల్లో విద్య వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

## నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు కొండపాక సివిల్ ఇంజనీర్ ఎంపిక


అవార్డుకు ఎంపికైన రమ్య శ్రీ

కొండపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీ నేషనల్ ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 21న బెంగళూరులో జరిగే కాన్ఫరెన్స్‌లో ఆమె అవార్డును అందుకోనున్నారు. హైదరాబాద్‌లో డిజైనెస్ట్ ఇంటీరియర్స్ కంపెనీని స్థాపించిన రమ్యశ్రీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు డిజైన్లను రూపొందిస్తున్నారు. రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కేటగిరీలో ఆమెకు 'ట్రెండ్‌సెట్టర్, ప్రామిసింగ్ ఇంటీరియర్ డిజైన్ ఫర్మ్ ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డు లభించింది. ఈ గుర్తింపు పట్ల రమ్యశ్రీ సంతోషం వ్యక్తం చేశారు.


మనోహరాబాద్ మండలం కొండాపూర్‌లో పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు

# కార్మికుల ప్రాణాలతో చెలగాటం

పరిశ్రమల నిర్లక్ష్యంపై ఆందోళన

ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకోని అధికారులు

మనోహరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా మనోహరాబాద్ ప్రాంతం పరిశ్రమలకు కేంద్రంగా మారింది. మండలంలో సుమారు 200 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పని చేసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వస్తున్నారు. పొట్టకూటి కోసం వచ్చే ఈ కార్మికుల ప్రాణాలకు ఇక్కడ భద్రత కరువైంది. పరిశ్రమల యజమాన్యాలు కార్మికులకు సరైన రక్షణ కల్పించకుండానే నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ గంటల పాటు ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినప్పటికీ, సంబంధిత అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఈ సమస్యను పట్టించుకోవడం లేదు.

### టీజీఐఐసీ అనుమతులకే పరిమితం

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తోంది. కానీ, ఆ తర్వాత పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పర్యవేక్షించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు ఆవైపు చూడడం లేదు. పరిశ్రమల్లోని 90 శాతం మంది వలస కార్మికులే కావడంతో యాజమాన్యాలు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

### పరిహారంలోనూ అన్యాయం

ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సరైన నష్టపరిహారం అందడం లేదు. వలస కార్మికులు కాబట్టి వారి కుటుంబాలు ఇక్కడికి రాలేవు. దీన్ని ఆసరాగా తీసుకుని యాజమాన్యాలు తక్కువ పరిహారంతో చేతులు దులుపుకుంటున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు మధ్యవర్తుల (కాంట్రాక్ట్ సోర్స్) ద్వారా కార్మికులను నియమించుకుని, ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబాలను బెదిరిస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తోటి కార్మికులు మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారు.

### పలు ప్రమాద ఘటనలు

● కాళ్లకల్ జాతీయ రహదారిపై ఉన్న రామ స్పిన్నింగ్ మిల్‌లో గత శనివారం గోడ కూలి కార్మికుడు తమ్మారెడ్డి బాల్‌రెడ్డి(56) మరణించాడు. మరో కార్మికుడు గానుగ రవి(43) కాలు కోల్పోయాడు. వారికి తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి యాజమాన్యం చేతులు దులుపుకుంది.
● కొండాపూర్ టీజీఐఐసీ పారిశ్రామిక వాడలోని శ్రీయాన్ పాలిమార్ పరిశ్రమలో ఏప్రిల్‌లో విద్యుత్‌షాక్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రఘునాథ్‌సింగ్ (21) మృతి చెందాడు. గతంలోనూ ఈ పరిశ్రమలో ఇలాంటి ఘటనలు జరిగాయని కార్మికులు చెబుతున్నారు.
● రంగాయపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో 35 రోజుల వ్యవధిలో ఇద్దరు వలస కార్మికులు చనిపోయారు. ఇటీవల కాళ్లకల్‌లోని మహాలక్ష్మి స్టీల్ పరిశ్రమలో పైపులు మీదపడి ఒకరు మరణించారు.
● ఈ నెల 5న కూచారం శ్రీయన్ ల్యాబ్ లిమిటెడ్ పరిశ్రమలో గ్యాస్ లీకేజీ వల్ల ఎనిమిది మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

### అగ్నిమాపక కేంద్రం లేక ప్రాణనష్టం

వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నప్పటికీ, తూప్రాన్ ఉమ్మడి మండలంలో ఒక్క అగ్నిమాపక కేంద్రం కూడా లేదు. ప్రమాదం జరిగితే నర్సాపూర్ నుంచి ఫైర్ ఇంజన్ రావడానికి సమయం పడుతుంది. ఈ జాప్యంతో ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రమవుతోంది. చాలా పరిశ్రమలు కనీస నిబంధనలు పాటించడం లేదు. అనుమతులు లేకుండా కల్తీ పదార్థాలు తయారు చేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి.

## సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల చెక్కులను అందజేశారు.

## అనారోగ్యంతో పోస్టల్ ఉద్యోగి మృతి

తూప్రాన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో పోస్టల్ ఉద్యోగి మృతిచెందాడు. ఇస్లాంపూర్‌కు చెందిన కుమ్మరి స్వామి(41) మాసాయిపేట మండల కేంద్రంలోని పోస్టాఫీసులో ఉత్తరాలు బట్వాడ చేసే ఈడీడీఏ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు నిర్వహించిన స్వామి బుధవారం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడు స్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

- కందిలో 60 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉన్నది
- రైతులు ఆందోళన చెందొద్దు
- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్


బేగంపేటలోని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణంలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న శివప్రసాద్

కంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో అక్రమంగా ఎరువుల నిల్వచేసి, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే ఎఫ్‌సీవో యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. కంది మండలంలోని బేగంపేట గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణంలో గురువారం ఏవో శ్రీనివాస్‌తో కలిసి యూరియా స్టాక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, ఇతర ఫర్టిలైజర్ల నిల్వలను, ఎరువుల అమ్మకాల స్టాక్‌బోర్డులు, రికార్డులను, పీవోఎస్ మిషన్లను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఎరువులను విక్రయించే డీలర్లు కచ్చితంగా ప్రతీ రైతు ఆధార్‌కార్డు నంబరును పీవోఎస్(పాయింట్ ఆఫ్ సేల్) మిషన్‌లో ఎంట్రీ చేసి అమ్మాలని ఆదేశించారు. అమ్మిన ప్రతీ బస్తాకు తప్పకుండా రసీదులు, బిల్లులు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం కంది మండలంలోని పీఏసీఎస్, కాశీపూర్, బేగంపేటలోని మూడు ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో 60 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉన్నదని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

## అక్రమాలకు అండ.. పంచాయతీల పచ్చజెండా

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం వెళితే ఎదురయ్యే అడ్డంకులను తప్పించుకోవడానికి ఈ అడ్డదారులు తొక్కుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌ల నుంచి అసెస్‌మెంట్ నంబర్లను జనరేట్ చేస్తున్నారని, అయితే వాటిని పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయడం లేదని తెలుస్తోంది. గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం ఎస్‌పీబీ సర్వే నిర్వహించారు. సగటున 3.5 మందికి ఒక అసెస్ మెంట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండటంతో ఇళ్లు, పశువుల పాకలు, ఖాళీ స్థలాలకు అసెస్మెంట్ నంబర్లు ఇచ్చారు. ఒక గ్రామంలో ఉన్న ఇళ్లకు రెండింతలు అసెస్‌మెంట్ నంబర్లు ఇవ్వడంతో ఆ నంబర్లతోనే తమ వ్యవహారమంతా కానిచ్చేస్తున్నారు. గ్రామంలో ఇళ్లు లేని వ్యక్తుల పేరిట కూడా అసెస్‌మెంట్ నంబర్లు జారీ అయినట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు పరిశీలిస్తే ఈ అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి.

### పారిశ్రామిక వాడల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు

జిల్లాలోని మనోహరాబాద్ మండలం హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ గ్రామపంచాయతీ అనుమతితో కేవలం గ్రౌండ్ ఫ్లోర్ + రెండు అంతస్తుల వరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి. కానీ కాళ్లకల్, మనోహరాబాద్, దండుపల్లి వంటి గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. కార్యదర్శులు డబ్బులు తీసుకుని ఈ పనులకు అనుమతులు ఇస్తున్నారని సమాచారం.



## బీజేపీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని( ఆఫీస్ బేరర్లు) ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ప్రకటించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రతాప్‌రెడ్డి, ఎల్లయ్య, వెంకటనర్సింహారెడ్డి, రామకృష్ణ, పవన్, భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, జగనాథ్, కార్యదర్శులుగా నాగరాజు, రాజురాథోడ్, భూమయ్య, రవిశంకర్, అరుణ్‌రాజ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌గుప్తా, సోషల్ మీడియా ఇన్‌చార్జి శైలజశర్మ, మీడియా కన్వీనర్‌గా డా.రాజు గౌడ్, ఐటీ ఇన్‌చార్జిగా మాధురినియమితులయ్యారు.

## 'మురుగు సమస్యలకు పరిష్కారం'

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో మురుగు పైపులైన్ పనులు ప్రారంభించారు.

## పరిశుభ్రతలో కార్మికుల సేవలు భేష్ : ఎమ్మెల్యే


ఖేడ్‌లో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రత విషయంలో పారిశుధ్య కార్మికుల సేవలు, పనితీరు భేషుగ్గా ఉందని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పారిశుధ్య కార్మికులకు గుర్తింపుకార్డులు, దుస్తులు, పట్టుచీరలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్మికుల వేతనాల పెంపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మేనేజర్ వెంకటశివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కార్మికులు రక్షణ చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులు యూనిఫాం ధరించడమే కాకుండా.. రక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు యూనిఫాం అందజేసి మాట్లాడారు. పట్టణం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్


పెద్దశంకరంపేటలోని పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

రేగోడు/పెద్దశంకరంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు అధికంగా ఉండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య అధికారి శ్రీరామ్ అన్నారు. గురువారం రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఆస్పత్రిలో మరుగుదొడ్ల, ప్రహరీ నిర్మాణాలకు నిధులు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిలు హరిప్రసాద్, నవ్యశ్రీ, శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సాయంత్రం జిల్లా డీఎంహెచ్‌వో శ్రీరాం, ఏవో హరి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్‌ను, రికార్డులను, ల్యాబ్, ఫార్మసీలను తనిఖీ చేశారు. వారి వెంట మండల వైద్యాధికారి షర్ఫొద్దీన్, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

## దేశ సమైక్యత అందరి బాధ్యత

- బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్



మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో మల్లేశంగౌడ్, బీజేపీ నేతలు

మెదక్ అర్బన్/నారాయణఖేడ్/గుమ్మడిదల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన జాతీయ జెండాలను చేతపట్టుకొని పలు కళాశాల విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. 300 మీటర్ల భారీ జాతీయ పతాకాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాంచరణయాదవ్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, నందారెడ్డి, రాగి రాములు పాల్గొన్నారు. ఖేడ్ పట్టణంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు సింధోల్ దశరత్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ నుంచి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదల మున్సిపల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు సారా సృజనలక్ష్మి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మడూర్ హైస్కూల్ విద్యార్థులు


చిన్నశంకరంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 18 నుంచి 19 తేదీవరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చిన్నశంకరంపేట మండలం మడూర్ హైస్కూల్ విద్యార్థులు అక్షిత, హేమజ, లిఖిత, రేవేష్, సుమంత్ ఎంపికయ్యారని హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్-15 విభాగంలో పాల్గొంటారని చెప్పారు. డీఈవో రాధాకిషన్ ఆదేశాల మేరకు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.నాగరాజు మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు.

## ఆటలు స్ఫూర్తిని పెంపొందిస్తాయి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆటలు సామరస్యాన్ని, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందిస్తాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామోత్సవ వేడుకకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 23న సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 14 ఏళ్ల పురుషులు, 13-21 పైబడిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం : ఎమ్మెల్యే


సీఎం సహాయనిధి పత్రాలు అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గవ్యాప్తంగా 48 మందికి సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. నిరుపేదలు నాణ్యమైన వైద్యసేవలు అందుకునేందుకు సహకారం చేస్తున్నామన్నారు.

# పోటాపోటీగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం


కరస్‌గుత్తిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి

నాగల్‌గిద్ద, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండలంలో గురువారం కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం పోటాపోటీగా నిర్వహించారు. కరస్‌గుత్తిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. దీంతో పాటు మండలంలో పలు తండాలకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి పార్టీ సత్తాను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేత్రిపండరి, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పేదల పార్టీ : చంద్రశేఖర్‌రెడ్డి

కాంగ్రెస్ పేదల పార్టీ అని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కరస్‌గుత్తిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరినాథ్, మాజీ సర్పంచులు అనిల్‌పాటిల్, సంజీవ్‌పాటిల్, విఠల్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ సమావేశాల సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మనూరు, నాగల్‌గిద్ద ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.

## సామాజిక బాధ్యతతో మార్పులు : ఆర్డీవో

తూప్రాన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతతో కార్పొరేట్ కంపెనీలు చేసే సహాయాలు సమాజంలో మార్పులకు కారణమవుతున్నాయని, అందుకు నిదర్శనమే తూప్రాన్ గురుకుల పాఠశాల, కళాశాల అని ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం టోల్‌ప్లాజా వద్ద గల గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి, వారితో కలిసి భోజనం చేశారు. వంట పదార్థాల నాణ్యతను పరిశీలించారు. గతంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి కలెక్టర్ సహకారంతో స్థానికంగా ఉండే పరిశ్రమ సహాయంతో గురుకులానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన, రగ్బీ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆర్డీవో అభినందించారు.

## 1న మహాధర్నాను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ, టీఎన్జీవో, టీజీఈజేఏసీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న పీఆర్టీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ 'మహాధర్నా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూటీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఏ.మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభు కోరారు. సంగారెడ్డిలోని ఐబీలో మహాధర్నా పోస్టర్‌ను టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ జావిద్‌అలీ, సెక్రటరీ వైద్యనాథ్‌తో కలిసి గురువారం ఆవిష్కరించి, వారు మాట్లాడారు. సీపీఎస్ రద్దుకు ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాంరాథోడ్, టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

## అధికారుల మధ్య సమన్వయలోపంపై విచారణ

కోహీర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ ఎంపీడీవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్, ఎంపీడీవోల మధ్య సమన్వయం లోపించడం వల్ల ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు జూనియర్ అసిస్టెంట్ ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లా డిప్యూటీ సీఈవో స్వప్న విచారణ చేపట్టి, కార్యాలయంలోని సిబ్బందితో మాట్లాడారు. అందరి అభిప్రాయాలను, వివరాలను నమోదు చేసుకున్న ఆమె జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

## శ్మశానవాటిక కూల్చివేతపై నిరసన

మాసాయిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన రజక సంఘం నిర్మిస్తున్న శ్మశానవాటికను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి కూల్చేశారు. ఈ విషయమై గురువారం స్థానిక రజక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి మాసాయిపేటలోని జాతీయ రహదారి పక్కన గల శ్మశానవాటికను వాడుకుంటున్నామని, శ్మశానవాటికను కూల్చేసినవారిపై సంఘం బాధ్యులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు సస్పెండ్

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ

మెదక్ అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఆ చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. ప్రజల్ని అదుపు చేయాల్సిన పోలీసులు పక్కదారి పట్టారు. ఏకంగా పోలీసులే జూదం ఆడుతూ పట్టుబడ్డారు. ఈ ఘటన మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పేకాట ఆడుతూ పట్టుబడిన ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు అంజనేయులు, సురేష్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.